ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
శుక్రవారం | అక్టోబరు 09, 2026 | సంపుటి : 7 | సంచిక : 110 | పేజీలు : 2



# మండుతున్న ఎండలు
## నైరుతి తిరోగమనం

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కన్నా 3 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీంతో ఉక్కపోత వాతావరణం నెలకొని జనం అసౌకర్యానికి గురవుతున్నారు. రాబోయే రోజుల్లో వాతావరణ పరిస్థితులు ఈ విధంగానే కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆదిలాబాద్‌లో 37, భద్రాచలం, మహబూబ్ నగర్‌లో 36.2, హైదరాబాద్‌లో 35 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభమైంది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ నుంచి రుతుపవనాలు వెళ్లిపోగా.. శుక్రవారం కల్లా రాష్ట్రం నుంచి రుతుపవనాలు పూర్తి స్థాయిలో నిష్క్రమిస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

## 11 నుంచి శ్రీభద్రకాళి దేవీ
# శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఆలయంలో ఏర్పాట్లు : ఈవో సునీత
- ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్, ఆయుధం:** ఓరుగల్లు ఇలవేల్పు దైవం శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఈనెల 11 తేదీ నుండి 21వ తేదీ వరకు శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామల సునీత తెలిపారు. గురువారం ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. ఆలయంలో మొట్టమొదటిసారిగా కోటి రూపాయల ఖర్చుతో మాడవీధులలో ఏడవ రోజు రథోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. నీటి వసతి లేనందున తెప్పోత్సవం ఆంతరంగికంగా నిర్వహిస్తామని చెప్పారు. ఆలయంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మంచి నీటి వసతులు, ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో పాండాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీస్, మున్సిపల్, ఎండోమెంట్ ఇతర శాఖల సమన్వయంతో పనుల నిర్వహణ జరుగుతుందని చెప్పారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఈవో సునీత కోరారు. అలాగే ఆలయ అర్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ.. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలను వివరించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగించే
# కుట్ర ఎస్ఐఆర్

- సీఈసీ రాజీనామాకు అభిజీత్ దీప్కే, ధ్రువ్ రాఠీ, ప్రకాశ్ రాజ్ డిమాండ్
- సర్ కు వ్యతిరేకంగా బెంగళూరులో సీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసన

**బెంగళూరు, ఆయుధం:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కొద్ది రోజులుగా ఈ సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి, ఇతర ప్రతిపక్ష పార్టీలు సహా కాక్రోచ్ జనతా పార్టీ, ఇతర పౌర సమాజ సంఘాలు నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసే వర్గాల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడానికే ఈ సర్ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ, ఇతర పౌర సమాజ ప్రతినిధులతో కలిసి బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో 'పీపుల్స్ ట్రైబ్యునల్' పేరిట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభిజీత్ దీప్కే సహా ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, నటుడు, కార్యకర్త అయిన ప్రకాశ్ రాజ్ ఎన్నికల సంఘం తీరుపై విరుచుకుపడ్డారు.
సర్ ప్రక్రియను తీవ్రంగా విమర్శించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో కొందరు తాము బతికే ఉన్నాయని చూయించేందుకు ఈ కార్యక్రమానికి వచ్చారని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే వారిలో కొందరిని వేదికపైకి తీసుకొచ్చి 'వారు భౌతికంగా చనిపోలేదు. కానీ మన దేశంలో ప్రజాస్వామ్యం చనిపోతోంది.' అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లు, ఇంకా ఒక్క కర్ణాటకలోనే దాదాపు కోటి ఓట్లు తొలగించారని ఆయన ఆరోపించారు. ఓట్లను తొలగించి, దొంగిలించి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యారని విమర్శించారు. ప్రధాని, ఎన్నికల సంఘం కలిసి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని అన్నారు. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాలతోనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘం అధికారులు ఓట్లు తొలగిస్తున్నారని విమర్శలు చేశారు. ఇదే సమయంలో రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కూడా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని అడ్డుకోవాలని దీప్కే పిలుపునిచ్చారు.

### సర్ మొత్తానికే రద్దు చేయాలి: ప్రకాశ్ రాజ్

నటుడు, కార్యకర్త ప్రకాశ్ రాజ్ కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. సర్ ప్రక్రియతో ఓట్ల తొలగింపు కేవలం ఓటు హక్కుపై దాడి మాత్రమే కాదని, ఇది దేశ ప్రజల ఆత్మగౌరవంపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. 'మా పోరాటం కేవలం జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతోనే ఆగిపోదు. ఒక వ్యక్తి స్థానంలో మరో వ్యక్తి వచ్చినా ఎలాంటి మార్పు ఉండదు. ఈ సర్ ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలి.' అని ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. గిరిజనులు, ముస్లింలు, పేదలు, ఇతర మైనారిటీ వర్గాల ఓటర్లనే లక్ష్యంగా చేసుకొని వారి ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇక నిరసనకారులు తమ ఆందోళనలను శాంతియుతంగా కొనసాగించాలని, పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు వారి తరఫున తాము పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీ అరెస్టు కేంద్రం నిరంకుశ వైఖరికి పరాకాష్ఠ

- మాజీ మంత్రి కొండా సురేఖ
- పోచంమైదాన్ సెంటర్‌లో నిరసన






**వరంగల్, ఆయుధం:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి ఓటు ప్రజల హక్కుకు ప్రతీక అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు. ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కొండా సురేఖ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, ఓటు హక్కును కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సురేఖ స్పష్టం చేశారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ఠ అని నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని, కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేలా ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని మాజీ మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు జారతి రమేష్, కత్తెరసాల వేణుగోపాల్, ఎండి.ఫుర్ఖాన్, బాబు, కుమార్, సురేష్, అనిల్, లీలావతి సత్యనారాయణ, ఉమా దామోదర్ యాదవ్, పల్లం పద్మా రవి, కావేటి కవిత, భోగి సువర్ణ సురేష్, వసుంధర, కల్పన సంజయ్, తదితరులు పాల్గొన్నారు.




## పేదల ఇళ్ల కూల్చివేతలు
# నిలిపివేయాలి

- దళితులపై కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తోంది
- హైకోర్టు స్టే ఉన్నా ఇళ్లను కూల్చడం కోర్టు ధిక్కరణే
- మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి

**హనుమకొండ, ఆయుధం:** పేదల ఇళ్ల కూల్చివేతను వెంటనే నిలిపివేయాలని మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి పేర్కొన్నారు. బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భద్రకాళి ఆలయం వెనకాల ఉన్న చరబండ్ల రాజుల కాలనీ వాసుల సమస్యలను ప్రస్తావిస్తూ పేదలు, దళితుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండించారు. భద్రకాళి ఆలయం వెనకాల ఉన్న చరబండ్ల రాజుల కాలనీ వాసులే తమ సమస్యల పరిష్కారం కోసం బండలు కొట్టి దారి ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న పేద ప్రజల ఇళ్లను అక్రమంగా కూల్చివేయడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే దళితులు, పేదలపై దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు దళితులకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పక్కన పెట్టి మోసం చేసిందని ఆరోపించారు.
"ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు.. నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తూ ఏ రకమైన రాజ్యాన్ని తీసుకొస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలి" అని మర్రి యాదవ రెడ్డి ప్రశ్నించారు. నిరుపేదలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారినే ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు. అలాగే నాయిని రాజేందర్ రెడ్డి ప్రమేయంతోనే అక్రమ కేసులు నమోదు చేశారనే ఆరోపణలు వస్తున్నాయని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని మర్రి యాదవ రెడ్డి డిమాండ్ చేశారు.
మాజీ కార్పొరేటర్ జోరికే రమేష్ మాట్లాడుతూ... దేశ రాజధాని ఢిల్లీలో రాహుల్ గాంధీ చేస్తున్న ధర్నాకు సంఘీభావంగా కాంగ్రెస్ నాయకులు పోలీసుల పహారాలో ధర్నాలు చేస్తున్నారని, అదే సమయంలో రాష్ట్రంలో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా చేస్తే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని జోరికే రమేష్ విమర్శించారు.

### గ్రేటర్ వరంగల్ ఎన్నికలపై సవాల్

రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని జోరికే రమేష్ డిమాండ్ చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలే అంతిమ నిర్ణేతలని, ఎవరి పనితీరు ఎలా ఉందో ప్రజలకు తెలుసని అన్నారు. "ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయండి.. ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుదాం. ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయో ప్రజలే నిర్ణయిస్తారు" అని కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరారు. పేదలు, దళితులు, బలహీన వర్గాల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడతామని అన్నారు.

## ఇన్నర్ రింగ్ రోడ్డు భూ సేకరణ
# త్వరగా పూర్తి చేయాలి

- అభివృద్ధి పనులను స్పీడప్ చేయాలి
- కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, వైస్ చైర్ పర్సన్, చాహత్ బాజ్ పాయి



**వరంగల్, ఆయుధం:** వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన మిగిలి ఉన్న భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, కుడా వైస్ చైర్ పర్సన్ , హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం వరంగల్ నాయుడు పెట్రోల్ పంప్ జంక్షన్ నుండి తూర్పుకోట, జాన్ పీరీలు గేట్ , తదితర ప్రాంతాలలో భూసేకరణ ప్రక్రియను, తూర్పుకోట వద్ద అభివృద్ధి చేయనున్న మోటును క్షేత్రస్థాయిలో కుడా చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ (మిగతా 2లో..)

# సిబ్బంది పనితీరుపైనే పోలీస్ శాఖ ప్రతిష్ట

- వరంగల్ సీపీ ఎన్. శ్వేతా ఐపీఎస్




**వరంగల్, ఆయుధం:** గస్తీ విధులు నిర్వహించే సిబ్బంది పనితీరుపైనే పోలీస్ శాఖ ప్రతిష్ఠ ఆధారపడి ఉంటుందని వరంగల్ సీపీ ఎన్. శ్వేతా ఐపీఎస్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను ఆమె గురువారం తనిఖీ చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత పూల మొక్కను అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి "పోలీస్ శాఖ ప్రతిష్ఠ అనేది గస్తీ విధులు నిర్వహించే సిబ్బంది పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని. గస్తీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ విధులు నిర్వహించినప్పుడే పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని.. సిబ్బంది సమర్థవంతమైన విధుల నిర్వహణతో పోలీస్ శాఖ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని" అని తెలిపారు. ప్రతి పోలీస్ సిబ్బంది తమకు అప్పగించిన విధులను అంకితభావంతో, క్రమశిక్షణతో నిర్వహించాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని సీపీ సూచించారు. నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసులు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, పోలీసు సిబ్బంది వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు ఆర్థిక క్రమశిక్షణకు అలవాటు పడినప్పుడే కుటుంబ భవిష్యత్తు బాగుంటుందని హితవు పలికారు. అనంతరము పోలీస్ స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్సై సతీష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.




# అది ఫేక్ ఫొటో.. నమ్మొద్దు : సీపీ సజ్జనార్

**హైదరాబాద్, ఆయుధం:** సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది ఫేక్ ఫొటో అని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ అభిమానులు కొందరు తన ఫొటోను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంటూ సినీనటుడు ఎన్టీఆర్‌కు చెందిన సోషల్ మీడియా ఖాతాను ట్యాగ్‌చేశారు. "అది ఏఐ ద్వారా రూపొందించిన ఫేక్ ఫొటో. దయ చేసి నెటిజన్లు ఇలాంటి డీప్‌ఫేక్ వలలో పడకండి. వాటిలో నిజానిజాలు తెలుసుకోకుండా షేర్ చేయొద్దు. ఏఐ సాయంతో రూపొందించిన చిత్రాలు రోజు రోజుకీ మరింత వాస్తవికంగా కనిపిస్తున్నందున.. ఆన్‌లైన్‌లో చూసేవాటి వెనుక వాస్తవాలు తెలుసుకోవడం ముఖ్యం. ఏదైనా ఫొటో నమ్మశక్యంగా కనిపించినంత మాత్రాన అది నిజమైంది కాదు. ప్రజలు వాస్తవాలను సరి చూసుకోకుండా కంటెంట్‌ను షేర్ చేసినప్పుడు తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతుంది" అని సజ్జనార్ పోస్టు చేశారు. 'దేవర' చిత్రంలోని "చుట్టమల్లే..." పాటను ఏఐ సాయంతో అసభ్యకరంగా మార్ఫింగ్ చేసిన నిందితులను సీపీ సజ్జనార్ అరెస్ట్ చేశారంటూ ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో సీపీ సజ్జనార్ స్పందించి.. అది ఫేక్ ఫొటో అని క్లారిటీ ఇచ్చారు.

# రహదారుల పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అక్రమ ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయి



**వరంగల్, ఆయుధం:** నగరంలో రహదారుల వెంట ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి నగరంలోని కల్లుమండువా జంక్షన్, చింతగట్టు క్యాంపు, రామారం, కాకతీయ యూనివర్సిటీ రెండవ గేట్, ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లో పర్యటించి రహదారుల పరిస్థితి, ట్రాఫిక్, ఆక్రమణలు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. రహదారికి ఇరువైపులా ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఏర్పాటు చేసిన బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు, డబ్బాలు తదితర ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులను ఆదేశించారు. రహదారుల వెంట ఆక్రమణల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రమాదాలకు అవకాశం ఉన్నందున, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా నగరంలోని పారిశుద్ధ్య నిర్వహణను కూడా కలెక్టర్ పరిశీలించారు. రహదారులు, ప్రధాన కూడళ్లు, పరిసర ప్రాంతాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. డివైడర్లు, మీడియన్స్ మరమ్మతులు ఉన్నట్లయితే వెంటనే చేయించాలన్నారు.

ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ రహదారుల వెంట ఆక్రమణలను గుర్తించి తొలగించడంతో పాటు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా సిఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ రాజ్‌కుమార్, సీహెచ్వో లక్ష్మారెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్ రెడేకర్, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఈఈ రవికుమార్ తో పాటు ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, టౌన్ ప్లానింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# పేదింటి ఆడపడుచుల పాలిట వరం కల్యాణలక్ష్మి

- మాజీ మంత్రి కొండా సురేఖ

**వరంగల్, ఆయుధం:** వరంగల్ 21వ డివిజన్ లో గురువారం 264 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ చెక్కులను మాజీ మంత్రి కొండా సురేఖ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లిలకు మేమున్నామని భరోసా ఇస్తూ ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. అందరికీ సమాన న్యాయం చేయడం, నిరుపేదల కుటుంబాలు వెలుగులు నింపడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ముందుకు పోతున్నదని కొండా సురేఖ చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమం అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూన్నదని అన్నారు. ప్రతి ఇంటికి ఇల్లాలే వెలుగని, మహిళ లక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షలకు ఆరోగ్య శ్రీ పెంపు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, పేదల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందుతున్నాయన్నారు. ఉచిత బస్సు సౌకర్యం ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తున్నామని తెలిపారు దేశంలో ఎక్కడ లేనివిధంగా సన్న బియ్యం పథకం అమలు చేస్తున్నామని మాజీ మంత్రి తెలిపారు. అర్హులైన వారికి నూతన రేషన్ కార్డులు అందజేస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులు అధైర్యపడవలసిన అవసరం లేదని మాజీ మంత్రి కొండా సురేఖ తెలిపారు.

## 37వ డివిజన్‌లో 9 మందికి..

37వ డివిజన్లోని 9 మంది లబ్ధిదారులకు తొమ్మిది లక్షల ఒక వెయ్యి నలభై నాలుగు రూపాయల విలువైన చెక్కులు తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ తో కలిసి మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ లు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అందుకే ప్రభుత్వ ప్రజా ప్రభుత్వం కూడా కొనసాగిస్తూ పేదింటి పెళ్లికి చేయూతనిస్తుందని రాబోయే కాలంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి కొండ సురేఖ అన్నారు.

# బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కమిషనర్ టీ.వెంకన్న



**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ ఉత్సవాలు, 18, 20 తేదీల్లో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఉత్సవాల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించి సమర్ధవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ గ్రేటర్ వరంగల్ నగరంలోని పద్మాక్షి గుట్ట, బొందివాగు, బంధం చెరువు, భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల గుడి, గుండుచెరువు, పెద్ద చెరువు, హసన్‌పర్తి, ఉర్సుగుట్ట, బెస్తం చెరువు, రంగశాయిపేట, మెట్టుదర్వాజా, శివనగర్, కట్టమల్లన్న, తోట మైదానం, చిన్న వడ్డేపల్లి, కాశిబుగ్గ తదితర ప్రాంతాలను కమిషనర్ సందర్శించి సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. బతుకమ్మ వేడుకలు, దసరా ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఉత్సవ ప్రదేశాలు, ఆలయాల పరిసరాలు, ప్రధాన రహదారులు, చెరువుల వద్ద నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైన చోట్ల ఫాగింగ్, క్రిమిసంహారక మందుల పిచికారీ చేపట్టాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజల రద్దీకి అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి, అవసరమైన చోట్ల ప్రత్యేక పారిశుద్ధ్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.

ఉత్సవ ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట్ల హైమాస్ట్ లైట్లు, అదనపు లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ స్థలాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. ఈ పర్యటనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సంబంధిత ఈఈలు, డీఈలు, ఎంటమాలజీ అధికారి రజని సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను ఉపసంహరించాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస రావు



**హనుమకొండ, ఆయుధం:** రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలపై, చిన్న వ్యాపారాలపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి విద్యుత్ భారాన్ని మోపేందుకు సిద్ధమవడం అత్యంత దుర్మార్గం, గర్హనీయం ఇని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో సిపిఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో నవంబర్ నెల నుంచి విద్యుత్ బిల్లులపై ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ. 5,420 కోట్లకు పైగా అదనపు వడ్డనకు రంగం సిద్ధం చేయడం ప్రజల నడ్డి విరవడమే అవుతుందని తెలిపారు. గత సంవత్సరాల విద్యుత్ కొనుగోలు వ్యయాలు, ఆదాయ లోటు సాకులతో గృహ, వాణిజ్య వినియోగదారులపై యూనిట్‌కు నవంబర్‌లో 30 పైసలు, డిసెంబర్ నుంచి 50 పైసల చొప్పున అదనపు భారం మోపడం సరికాదని, ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలతో అల్లాడిపోతున్న సామాన్యులకు ఈ కరెంట్ ఛార్జీల వాత మరింత భారంగా మారుతుందన్నారు. ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపే ఈ అదనపు ట్రూఅప్ ఛార్జీల ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే బేషరతుగా ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిస్కంల నిర్వహణ లోపాలు, కొనుగోలు వ్యయాల భారాన్ని ప్రజలపై రుద్దకుండా, ప్రభుత్వమే ఆ బకాయిలను పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని వెనక్కిసుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను, వినియోగదారులను కలుపుకొని తీవ్రమైన ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



# బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**పరకాల, ఆయుధం:** పరకాలలో బతుకమ్మ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా పరకాల లో బతుకమ్మ ఉత్సవాలు జరిగే దామెర చెరువు, అంగడి మైదానం ప్రాంతాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దామెర చెరువు అంగడి మైదానంలో చేయాల్సిన ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలు జరిగే ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ బాగుండాలని అన్నారు. బతుకమ్మ ఆట స్థలాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డిఎస్. వెంకన్న, తహసిల్దార్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు బండి శ్రీధర్, అల్లె దశరథం, కుక్కల విజయ్, ఏఈ ప్రవీణ్ కుమార్, టిపిఎస్ రాజ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు, వసతులు మెరుగ్గా ఉండాలి

- పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**పరకాల, ఆయుధం:** పరకాలలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు, వసతులు ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులు, వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా పరకాల లో నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు, వివిధ విభాగాల్లో వసతులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని జనరల్ మేల్, ఫిమేల్ వార్డులను సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న పేషంట్లతో కలెక్టర్ మాట్లాడి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, గర్భిణీల యాంటీ నాటల్ వార్డ్, లేబర్ రూమ్, పోస్ట్ నాటల్ వార్డు, తదితర విభాగాలతో పాటు ఆసుపత్రిలోని మొదటి అంతస్తులో ఉన్న గదులను కలెక్టర్ పరిశీలించారు. తదుపరి ఏ ఏ విభాగాలకు గదులను కేటాయించనున్నారనే వివరాలు, వాటిలో కల్పించాల్సిన వసతులను గురించి అధికారులు, వైద్యులతో కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలు గర్భిణీల వివరాలను ట్యాబ్ లో ఏవిధంగా ఎంట్రీ చేస్తున్నారని వివరాలను ప్రత్యక్షంగా కలెక్టర్ పరిశీలించారు. ఆస్పత్రి ముందు భాగంలో ఉన్న ఖాళీ ప్రదేశం, పక్కనే ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పాత ఎంపీడీవో కార్యాలయం గదులను పరిశీలించారు. ఆసుపత్రి పక్కనే నిర్మితమవుతున్న భవనాన్ని ఆసుపత్రికి ఉపయోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఆయా విభాగాల పేర్లను సూచించే విధంగా సైన్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని టీజీఎంఎస్ఐడిసి అధికారులను ఆదేశించారు. ఫిజియోథెరపీ, బ్లడ్ బ్యాంక్, తదితర విభాగాలకు సరిపోయే విధంగా గదులను కేటాయించాలన్నారు. ఆసుపత్రిలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి ముందు భాగంలో ఖాళీ ప్రదేశంలో ప్లాంటేషన్ చేయాలని, బాక్స్ డ్రైన్ ను నిర్మించాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ కృష్ణ, ఆర్ఎంవోలు డాక్టర్ నారాయణ రెడ్డి, డాక్టర్ బాలకృష్ణ, పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డిఎస్ వెంకన్న, టీజీ ఎంఎస్ఐడిసి ఈఈ నందూ పటేల్, తహసిల్దార్ విజయలక్ష్మి, ఆర్ అండ్ బీ డీఈ లోరిన, ఇతర అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పోపా ప్రతిభా పురస్కార్ కరపత్రం ఆవిష్కరణ

**వరంగల్, ఆయుధం:** పద్మశాలి ప్రతిభా పురస్కారాలకి వరంగల్ ఉమ్మడి జిల్లా విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వరంగల్ జిల్లా పోప అధ్యక్షులు గుండు కామేశ్వర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈనెల 15వ తారీకు లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 25న శివనగర్ పద్మశాలి కళ్యాణ మండపం అండర్ బ్రిడ్జి శివనగర్ యందు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, గుండేటి సతీష్, మెరుగు సుభాష్, సంతోష్, వందన శ్యామ్, విజయ పాల్గొన్నారు.




# ధాన్యం తరలింపు పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ, ఆయుధం:** జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు కొనుగోలు ప్రక్రియ, దాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు, తదితర అంశాలపై అధికారులతో సమావేశాన్ని అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యం తరలించే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం తరలింపులో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డివో మేన శ్రీను, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మహేందర్, జిల్లా సహకార అధికారి మోహన్, సివిల్ సప్లై డీటీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

రోడ్డు కు సంబంధించి పెండింగ్ భూ సేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా తూర్పు కోట వద్ద మోటు అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, కుడా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, ఏపీవో శంకర్, అధికారులు పాల్గొన్నారు.

# బాలల స్నేహపూర్వక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: కమిషనర్ వెంకన్న




**వరంగల్, ఆయుధం:** చిన్నారులు, తల్లిదండ్రులు, కుటుంబాలకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన, పచ్చదనంతో కూడిన ప్రజా ప్రదేశాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'నర్చరింగ్ నెయిబర్‌హుడ్స్-2.0' సిటీ లెవల్ వర్క్‌షాప్‌ను గురువారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ.. పిల్లలు స్వేచ్ఛగా ఆడుకునేలా, తల్లిదండ్రులు ప్రశాంతంగా సమయం గడిపేలా నగరంలోని ప్రజా ప్రదేశాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్కులు కేవలం వినోదానికి పరిమితం కాకుండా చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడే విధంగా రూపుదిద్దుకోవాలని సూచించారు.

నగరంలో ఖాళీగా, నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించి వాటిని పార్కులు, ఆట స్థలాలు, ఆహ్లాదకరమైన ప్రజా ప్రదేశాలుగా మార్చేందుకు మరింత విస్తృతంగా చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే సుమారు 20 ప్రాంతాల్లో పార్కులు, పైప్‌లైన్ తదితర మౌలిక సదుపాయాల పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. చిన్నారులు, కుటుంబాలకు అనుకూలమైన వాతావరణం కల్పించడంలో భాగంగా 0-5 సంవత్సరాల పిల్లలకు సురక్షితమైన ఆట స్థలాల రూపకల్పన, ప్లేగ్రౌండ్ సేఫ్టీ మార్గదర్శకాల అమలు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వర్క్‌షాప్‌లో వివరించారు. బాలసముద్రం, క్రిస్టియన్ కాలనీ తదితర ప్రాంతాల్లో పిల్లలకు అనుకూలమైన ఆట స్థలాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల కొనసాగింపునకు శానిటేషన్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ తదితర మౌలిక సదుపాయాల విషయంలో జీడబ్ల్యూఎంసీ తరపున పూర్తి సహకారం అందిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. భాగస్వామ్య సంస్థలు, వివిధ ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ గుర్తించిన ప్రతి ప్రాంతాన్ని దశలవారీగా అభివృద్ధి చేసి, ఈ కార్యక్రమాన్ని నగరంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని స్పష్టం చేశారు.

వర్క్‌షాప్‌లో 2020-2026 మధ్య 'నర్చరింగ్ నెయిబర్‌హుడ్స్-2.0'లో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై ప్రజెంటేషన్ మరియు ప్రదర్శన నిర్వహించారు. నగర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, వరంగల్‌ను పిల్లలు, కుటుంబాలకు స్నేహపూర్వక నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, WRI ప్రోగ్రామ్ మేనేజర్ అరుణిమా సేన్, సీనియర్ ప్రోగ్రామ్ అసోసియేట్స్ శబ్నా సీమాము, సుఫియాన్ ఖాజీ, సిహెచ్ఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, హార్టికల్చర్ ఆఫీసర్ ప్రశాంత్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేందర్తో పాటు ఇంజనీరింగ్, హార్టికల్చర్, మెప్మా, ఐసీడీఎస్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by V.P.CHANDER. On Behalf of VNR MEDIA. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695